

గురుకులాలే ప్రామాణిక విద్యకు నిలయం

కలెక్టరేట్ : గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు ప్రామాణిక విద్యకు నిలయం కావాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అన్నారు. గురుకులం, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపల్స్, ప్రదానోపాధ్యాయులతో బుధవారం గిరిమిత్ర సమావేశ మందిరంలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం అధిక మొత్తంలో వెచ్చిస్తోందన్నారు. ఆ మేరకు విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థినీ ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. రానున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించుటకు ఇప్పటి నుంచే మంచి తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఐఐటి, ఎన్ఐటి వంటి విద్యాసంస్థలలో పలువురు సీట్లు సంపాదించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి పి.సూర్యనారాయణ, ఉప విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ రావు, ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్గొన్నారు.



జాగరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల అరెస్టు అప్రజాస్వామికం

నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యాన జాగరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

విజయవాడలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయుల అరెస్టులు అప్రజాస్వామికమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తోట రమేష్, ఎస్.మురళీమోహనరావు ఖండించారు. అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం పార్వతీపురం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు జాగరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఎఫ్, ఎపిజిఎస్ఐ, సరెండు లీవ్, తదితర బకాయిలు చెల్లించాలని ధర్నా చేస్తున్న వారిని అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. కనీసం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పే ప్రజాస్వామ్య వాతావరణం కూడా లేకుండా పోయిందని విమర్శించారు.

రాష్ట్ర కేంద్రంలో ధర్నా చేస్తామని ముందుగానే నోటీస్ ఇచ్చినా ప్రభుత్వాధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బకాయిలు చెల్లించాలని అడిగితే ఇంత నిర్బంధం ఎలాంటి ప్రజాస్వామ్యమని నిలదీశారు. శాంతియుత నిరసనకు కూడా ప్రభుత్వం ఎందుకు భయపడుతుందో చెప్పాలని అడిగారు. బకాయిలు చెల్లించలేక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఇలాంటి నిర్బంధాలు చేయడం పట్ల ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. యుటిఎఫ్ జాగరణకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మద్దతిచ్చారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం

ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అందుకు అధికారులంతా సహకారం అందించాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై జెసి ఒ.ఆనంద్, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే వాటిని సిఎం, సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జెసి ఆనంద్ మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీలు రావాల్సి ఉందన్నారు. జిల్లాలో 15 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్ మాట్లాడుతూ 1.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. జిల్లాలో 306 ఆర్‌బికెలకు గాను ఎ, బి, సి కేటగిరీలలో 188 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో 47.75 లక్షల గోనె సంచులు అవసరమని, 8,86,465 గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. రైస్ మిల్లర్ల సంఘం 10 లక్షల గోనె సంచుల కొనుగోలుకు అంగీకరించిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 1,10,473 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి సరిపడా గిడ్డంగులు ఉన్నాయని వివరించారు. సీతానగరం, బలిజిపేట, పాలకొండ మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, జిల్లా సరఫరాధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, జిల్లా సహకార అధికారి బి.సన్యాసి నాయుడు, గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్, వైకెపి ఎపిడి వై.సత్యంనాయుడు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొత్తకోట రమేష్, జిల్లా టాక్స్ అడ్వైజర్ గంటా అబ్బాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనాలని ఆందోళన

కొమరాడ : ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, మండల అధ్యక్ష, కార్యదర్శి నారాయణ, ఎ.ఉపేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు పంట పండించి తమ పొలాలలో ధాన్యం కుప్పలు కుప్పలుగా పోగు చేసుకుంటున్నా నేటికీ కొనుగోలు చేయకపోవడం చాలా దుర్మార్గమన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ధాన్యం పాడైపోతాయేమోనని రోడ్ల మీద ఎండబెట్టుకునే పరిస్థితి రైతుకు ఎదురవుతుందని వాపోయారు. ఇలాంటి సందర్భంలో ఓట్లు వేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు రైతు సమస్యలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకుల అండతో మిల్లర్లు కారుచౌకగా, బలవంతంగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై సమాచారమిచ్చినా ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని, సరిపడా గోనెసంచులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం తహశీల్దార్ రాధాకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బి.గౌరునాయుడు, శ్రీను, బుజ్జి, అప్పలస్వామి, లక్ష్మునాయుడు , రాము, ఎ.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ఆగ్రహం వెనుక ఆంతర్యమేమిటో?

అధికారుల తీరుపై చైర్‌పర్సన్ అసంతృప్తి స్వరం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అనూహ్యంగా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. బుధవారం ఆమె అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారుల పనితీరుపై మాటల దాడి చేశారు. సమావేశం అజెండాలో అంశాలను కౌన్సిలర్లు ఆమోదించిన తర్వాత జీరో అవర్‌లో ఆమె టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఆమె ఇంతలా ఆగ్రహించిన దాఖలాలు లేవు. ఉన్నపలంగా ఆమె అధికారులే లక్ష్యంగా మాట్లాడటంతో సొంత పార్టీ కౌన్సిలర్లు కూడా కొంత విస్మయానికి గురయ్యారు. గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో వైసిపికి చెందిన ఒక గ్రూపు కౌన్సిలర్లు అధికారుల తీరుపై విమర్శలు చేసేవారు. అప్పుడామె అధికారులకు కొంత అండగా నిలిచిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు ఛైర్‌పర్సన్ నేరుగా మాటల దాడి చేయడం సరికొత్త చర్చకు దారితీసింది. మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు కింది స్థాయి అధికారులతో సరిగా పని చేయించలేకపోతున్నారనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తపరిచారు. మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు ఎప్పుడు కార్యాలయానికి వస్తున్నారో, వెళుతున్నారో తెలియడం లేదని ఆగ్రహించారు. సిబ్బంది హాజరు పట్టిక తన ముందు పెట్టాలని సూచించారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు సజావుగానే జరుగుతున్నాయని, ఏ పనులూ ఆగడం లేదని కమిషనర్ శంకరరావు బదులివ్వడంపైనా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

ఆ అనుమానంతోనే..!

కొంతకాలంగా ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ కార్యాలయానికి దూరంగా ఉన్నారు. ఛైర్‌పర్సన్ భర్త, అర్బన్ బ్యాంకు మాజీ అధ్యక్షులు పువ్వల నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా ఆమె గాని, కుటుంబ సభ్యులు గాని మున్సిపల్ పాలనా వ్యవహారాలపై దృష్టి సారించలేదు. దీంతో తమకు తెలియకుండా ఏదో జరుగుతుందనే అభిప్రాయంతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. పాలనా వ్యవహారాలపై అధికారపార్టీకి చెందిన తన ప్రత్యర్థి గ్రూపు నాయకులు పట్టు బిగిస్తున్నారేమోనన్న అనుమానం కూడా మొగ్గ తొడిగినట్లు తెలుస్తోంది. అనూహ్యరీతిలో ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చేసిన వ్యాఖ్యలపై మున్సిపల్ ఉద్యోగుల్లోనూ చర్చ మొదలైంది.

క్రీడల్లో సత్తాచాటాలి

ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర • జగనన్న క్రీడా సంబరాలను ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మన్యం జిల్లా క్రీడాకారులు క్రీడా పోటీల్లో సత్తాచాటి, జిల్లా కీర్తి ప్రతిష్టలను రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేయాలని ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర కోరారు. జిల్లా స్థాయి జగనన్న క్రీడా సంబరాలను పట్టణంలోని ఆర్‌సిఎం ప్రాంగణంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎంతో కష్టపడి జిల్లా స్థాయికి వచ్చారని, ఇదే ఉత్సాహంతో రాష్ట్ర స్థాయిలో కూడా గెలుపొందాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, కానీ క్రీడా స్ఫూర్తి ముఖ్యమని పేర్కొన్నారు. గెలుపే లక్ష్యంగా సాధన చేయాలని క్రీడాకారులకు సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని చెప్పారు. క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. ఓటమితో కుంగి పోరాదని, మళ్లీ ప్రయత్నం చేయాలని ఉద్బోధించారు. ఎవరికీ విజయం అంత సులువుగా రాదని, కష్టపడితేనే సాధ్యమవుతుందని తెలిపారు. మన జిల్లాకు క్రీడా ప్రాంగణం (స్టేడియం) అవసరం ఎంతో ఉందని, ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



క్రీడాకారులతో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ మాట్లాడుతూ సచివాలయాల్లో స్పోర్ట్స్ క్లబ్ ఉందని, ప్రతీ క్రీడాకారుడు అందులో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, మున్సిపల్ చైర్మన్ బి.గౌరీశ్వరి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొన్న క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.మంజుల వీణ, జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, డిఎస్‌పి ఎ.సుభాష్, అర్జున అవార్డు గ్రహీత ఎస్.జయరామ్, తహశీల్దారు శివన్నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

22,472 మందికి విద్యాదీవెన



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో 22,472 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన నాలుగో విడత నిధులు మంజూరయ్యాయి. విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.11,65,75,221 కోట్లు జమయ్యాయి. బుధవారం జగనన్న విద్యా దీవెన నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం జరిగింది. వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా

విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.11.65 కోట్లు జమ

విద్యార్థుల తల్లులు, విద్యార్థులకు నమూనా చెక్కులను కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెనతో ఉన్నత విద్యను సాకారం చేసుకోవాలని కోరారు. కళాశాలలో చదువుతున్న ప్రతి పేద విద్యార్థి చదువుకయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నత చదువే లక్ష్యం

పాలకొండ రూరల్ : విద్యార్థుల ఉన్నత చదువే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్న విద్యా దీవెన నాలుగో విడత చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 5,997 విద్యార్థులకు రూ.2,86,82,939 మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపి కనపాక సూర్య ప్రకాష్, సీతంపేట ఎంపిపి ఆదినారాయణ, రాము, ఎజిపి చందక జగదీష్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి కృష్ణ, ఎంపిడిఒ త్రినాథులు పాల్గొన్నారు.

విద్యాదీవన విద్యార్థులకు వరం

కురుపాం : జగనన్న విద్యా దీవన విద్యార్థులకు వరమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. స్థానిక వైకెపి కార్యాలయంలో ఎటిడబ్ల్యుఒలు కె.చంద్రబాబు, సురేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ నాలుగో విడత జగనన్న విద్యాదీవెన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. రూ.2.99 కోట్ల చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, జెడ్‌పిటిసి జి.సుజాత, సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి వి.బంగారు నాయుడు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర రావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సబ్‌కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మ గదబవలస, రస్తా కుంటు బాయ్ గ్రామాల్లో బుధవారం సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్ పర్యటించారు. ఈ సందర్భంగా సవర, గదబ ప్రజల వద్దకు వెళ్లి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పని సరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు ఈ నెల 8వ తేది వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఉప తహశీల్దార్ కె.నాగేశ్వరరావు, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్

వంద గ్రామాల్లో రీ సర్వే

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో వంద గ్రామాలలో రెండో విడతలో సర్వే పూర్తి కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ రీసర్వేపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రౌండ్ ట్రూథింగ్ త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రీసర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. వెయ్యి ఎకరాలకు పైగా ఉన్న గ్రామాల్లో రోజుకు కనీసం 25 నుండి 30 ఎకరాలు సర్వే చేయాలన్నారు. అన్ని ఫార్మాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎస్ఇ సమీక్ష

ప్రజాశక్తి-పార్వతీపురం

పంచాయతీరాజ్ అభివృద్ధి పనులపై ఎస్ఇ కృష్ణాజి సమీక్షించారు. బుధవారం పంచాయతీ రాజ్ కార్యాలయంలో కాంట్రాక్టర్లు, ఇంజినీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అటవీ శాఖ అనుమతులు శరవేగంగా పరిష్కరించుకొని, పనులు ప్రారంభించాలని చెప్పారు. కార్యాలయంలో ఫైళ్ల పెండింగ్ లేకుండా క్లియిర్ చేస్తున్నామని తెలిపారు. ఇకపై ఫైళ్లన్నీ వెనువెంటనే క్లియిరెన్స్ జరగాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌సిపిసిడబ్ల్యుఇ, గ్రాంట్ సంబంధించిన రోడ్లపై కాంట్రాక్టర్లు, ఇంజినీర్స్, ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరగా పనులు చేపట్టాలని సూచించారు.

రహదారి పనుల పరిశీలన

పాచిపెంట : మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.వి.ఆర్ కృష్ణాజి బుధవారం పరిశీలించారు. 3.76 కోట్ల రూపాయలతో చేపడుతున్న నీలమ్మ వలస నుంచి గుమ్మడిగూడ రహదారి పనులను పరిశీలించారు. పాంచాలి, గురువునాయుడుపేట, రాయిగుడ్డి వలస గ్రామాల్లో సచివాలయ, ఆర్‌బికె భవన నిర్మాణాలను పరిశీలించారు. ఆయనతోపాటు డిఇ డబ్ల్యువిఎస్ఎస్ శర్మ, ఎఇ డి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ కృష్ణాజి

గురజాడకు ఘన నివాళి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురంలో మహాకవి గురజాడ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. పట్టణానికి చెందిన స్నేహ కళా సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి రచయిత గంటేడ గౌరినాయుడు, సాహితీ లహరి సంస్థ వ్యవస్థాపకులు మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి కూడలిలో ఉన్న గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమాలలో ఎస్‌వి డిగ్రీ కళాశాల, సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురజాడ దేశభక్తి గీతం ప్రత్యేకత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా రచయితలు సిరికి స్వామినాయుడు, పక్కి రవీంద్రనాథ్, గౌరినాయుడు తదితరులు కళాశాల విద్యార్థులకు గురజాడ గురించి, ఆయన చేసిన సాహితీసేవ, సమాజంలో మార్పు కోరుతూ ఆయన చేసిన రచనలపై వివరించారు. విజేతలకు పుస్తకాలు బహుమతులుగా అందించారు.

పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న గురజాడ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటనాయుడు, దుర్గ మోహన్, జి.రవికుమార్, బోను చంద్రమౌళి, జాగాన ధనుంజయ, కౌన్సిలర్లు బడే గౌర్నాయుడు. టి.వెంకట్రావు, కోల మధు తదితరులు పాల్గొన్నారు.



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

నీలకంఠాపురంలో బ్యాంకు పెట్టాలని ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

నీలకంఠాపురంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన గ్రామ సచివాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, కోలక అవినాష్ మాట్లాడుతూ నీలకంఠాపురం గ్రామానికి 9 పంచాయతీలు సమీపంలో ఉన్నాయని తెలిపారు. గతంలో ఉన్న ఎస్‌బిఐ బ్రాంచిని ఎత్తేయడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సుమారు 10 వేల వరకు అకౌంట్లు ఉన్నాయని గుర్తుచేశారు. ఇక్కడ బ్యాంకు లేకపోవడం వల్ల వేల మంది జనాభా అమ్మఒడి, రైతు భరోసా, తదితర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలు కురుపాం, గుమ్మలక్ష్మీపురం వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీలకంఠాపురంలో బ్యాంకును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయంలో వినతినిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, చెముడుగూడ ఎంపిటిసి ఎం.రమణ, మాజీ ఎంపిటిసి మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు



భోగాపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రభుత్వానికి బాధ్యత లేదు

ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి - పూసపాటిరేగ, భోగాపురం

ఇది బాధ్యత లేని ప్రభుత్వమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తోందని అన్నారు. బుధవారం ఆమె పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను, ఉపాధ్యాయులను కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం పోవాలంటే వ్యవసాయం మెరుగు పడాలన్నారు. ఉత్తరాంధ్ర వ్యవసాయానికి సాగు నీరు అవసరం నిమిత్తం రాష్ట్ర విభజనలో సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తామన్నారని గుర్తు చేశారు. బంగాళాఖాతంలో వృథాగా కలిసిపోయే నీటిని స్టోర్ చేసి వ్యవసాయానికి అందించే ఈ ప్రాజెక్ట్ ఇంత వరకూ ప్రారంభం కాలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లేదని, విశాఖపట్నంలో ఐటి హబ్ డవలప్ చేస్తామని చెప్పినా ఇంత వరకూ చేపట్ట లేదన్నారు. దీంతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రవేటీ కరణ లేదా అమ్మేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని ఈ తరుణంలో ఇంత మందికి ఉపాధి కల్పించే ఈ పరిశ్రమలను కాపాడుకోవాలని కోరారు. ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రవేటు విద్యాసంస్థలలో పనిచేసిన వారికి వెల్ఫేర్ బోర్డు స్థాపించి వారికి బీమా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి సమస్యలపై మన ప్రాంత గొంతు వినిపించడానికే తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. 250 సంఘాలు బలపరుస్తున్న అభ్యర్థి రమా ప్రభ అని యుటిఎఫ్ నాయకులు డి. రాము తెలిపారు.ఆమెను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆమెతో పాటు సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను బుధవారం డివిఇఒ మంజులవీణ పరిశీలించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-సీతానగరం

2022-23 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, 2023-24 అంచనా బడ్జెట్‌ను మండల సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి మాట్లాడుతూ 2022-23లో 65.80 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 71.90 కోట్లుగా అంచనా వేసినట్లు వెల్లడించారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక గాయత్రీ కాలేజీ ఆవరణలో గురువారం సిఐటియు మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు యూనియన్ మండల కార్యదర్శి గవర వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు అన్ని రంగాల కార్మికులు, కార్మిక సంఘ నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వికలాంగుల రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని గోపాలపురం సచివాలయం పరిధిలో చేపడుతున్న వికలాంగుల రీసర్వేను ఎంపిడిఒ డొంక త్రినాథులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పక్కగా జరగాలని, అర్హులు ఎవరూ తప్పిపోకుండా చూడాలని ఆదేశించారు.

బ్యాగులు వితరణ

ప్రజాశక్తి-సీతంపేట

యూత్ ఫర్ సేవా సహకారంతో సమాజ్ పరివర్తన్ ఆధ్వర్యంలో సీతంపేట బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. సర్పంచ్ కళావతి, ఎంఇఒ ఆనందరావు వీటిని అందజేశారు. ఎంఇఒ ఆనందరావు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో రకాల సౌకర్యాలను అందిస్తుందన్నారు. మరొకవైపు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పిఎంఆర్‌సి సిఎంఒ చిరంజీవులు, ప్రధానోపాధ్యాయులు టి చంద్రరావు, సంస్థ సభ్యులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని దేవరపేటకు చెందిన ఉపాధ్యాయులు గోరు వెంకటరావు, గుణసుందరి దంపతులు ఆలయ నిర్మాణానికి బుధవారం రూ.లక్ష విరాళమిచ్చారు. వీవర్స్ కాలనీలోని చిన్నపాపమ్మ పేరంటాల ఆలయ నిర్మాణానికి వెంకటరావు తండ్రి భద్రయ్య పేరిట ఆ మొత్తాన్ని అందించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమాక్షి

కామన్నదొరవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కామన్నదొరవలసలో బూర్జ ఆయుర్వేదిక వైద్యాధికారి టి.హేమాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రోగులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని ప్రీమెట్రిక్ వసతిగృహాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లు పంపిణీ చేసినట్టు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పి.శశిభూషణరావు తెలిపారు. ఇప్పటికే ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు అందించామని తెలిపారు. 205 మంది విద్యార్థులు ప్రభుత్వం అందించిన సౌకర్యాలు వినియోగించుకున్నారని చెప్పారు.

వారపు సంతలో ఎయిడ్స్‌పై ప్రచారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం వారపుసంతలో ఎయిడ్స్, తదితర ప్రాణాంతక వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ట్రాన్స్ జెండర్స్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి వారపు సంతలో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడమే తమ లక్ష్యమని వారన్నారు. ట్రాన్స్ జెండర్ గీతారాణి, మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పాలనలో జవాబుదారీతనం



మూలిగూడ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

'గడపగడపకు..'లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చేసే ప్రతి పనికి జవాబుదారీతనం ఉండే వ్యవస్థను తీసుకొచ్చిన ఏకైక నాయకుడు సిఎం జగన్ అని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి కొనియాడారు. మండలంలోని సిహెచ్ బిన్నిడి సచివాలయ పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలని ఆమె సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు ... రాధిక, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మూలిగూడ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి బుధవారం సందర్శించారు. ఎమ్మెల్యేకు హెచ్‌ఎం సామల సింహాచలం ఆధ్వర్యాన విద్యార్థులు స్వాగతం పలికారు. టీచర్లు రోజూ వస్తున్నారా, మధ్యాహ్న భోజనం బాగుంటుందా? అని ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలలో అందిస్తున్న జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాంచాలిలో రెండో రోజూ..

పాచిపెంట : మండలంలోని పాంచాలి గ్రామంలో బుధవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం మూడున్నర ఏళ్లలో అందచేసిన పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వివరాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-సీతంపేట

జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో రాష్ట్ర, ఐటిడిఎ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే వి.కళావతి, ఐటిడిఎ పిఒ నవ్య అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లా సైన్సు కాంగ్రెస్‌లో విజేతలనూ అభినందించారు. వారికి బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ఆరోగ్యంతోపాటు మానసికంగా ఎదగడానికి క్రీడలు ఉపయోగ పడతాయని చెప్పారు. విద్యతోపాటు క్రీడల్లో పోటీతత్వం పెరగాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి కో ఆప్షన్ సభ్యులు సవర లక్ష్మి, జెడ్‌పిటిసి లక్ష్మి, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, ఐటిడిఎ ఎపిఒ రోషి రెడ్డి, డిడి బి.నగేష్, ఎంఎంసి చైర్మన్ హిమరక మోహన్ రావు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఎఎంఒ పి.కోటిబాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే, పిఒ




విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ రమణ

మధ్యాహ్న భోజనంలో రాజీపడొద్దు

డిఇఒ రమణ

ప్రజాశక్తి-కొమరాడ

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ అన్నారు. బుధవారం మండలంలోని గిరిజన ప్రాంతాలైన జాకూరు, నయా, గుడ్డం, సరుగుడుగూడ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. సరుగుడుగూడలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గుడ్డంలో నాడు-నేడు నిధులతో చేపడుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు మంచి విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించి ఆరోగ్యంపై శ్రద్ధపెడుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, సక్రమంగా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు-నేడు పనులు వేగవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ జామి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ పార్వతీపురం, కురుపాం తాలూకా కార్యవర్గాలు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా కార్యవర్గాలు ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ పార్వతీపురం, కురుపాం తాలూకా కార్యవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. బుధవారం పార్వతీపురంలో ఎన్‌జిఒ హోంలో జిల్లా ఎన్నికల అధికారి కె.ఆదిలక్ష్మి ఆధ్వర్యాన సహాయ ఎన్నికల అధికారి రామారావు, పరిశీలకులు కెబి శ్రీను, శ్రీధర్‌బాబు సమక్షంలో పార్వతీపురం తాలూకా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డివిరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్వతీపురం తాలూకా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిశోర్ ఎన్నికయ్యారు. కిశోర్ వరుసగా ఏడోసారి ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికవడం గమనార్హం. అసోసియేట్ అధ్యక్షులుగా వైవి సత్యారావు, కార్యదర్శిగా పి. పద్మ, కోశాధికారిగా జి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వల్లూరి శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్, యు.గౌరీశంకరరావు, పి.తిరుపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కె రత్నకుమార్, జి.వినయ్ కుమార్, చిట్టి శంకరరావు, కె.మధుకర్, మహిళాసహాయకార్యదర్శిగా బి.పుష్ప ఎన్నికయ్యారు. కిశోర్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, తదితరులు అభినందించారు.

కురుపాం తాలూకా..

కురుపాం: స్థానిక పెన్షనర్ల క్లబ్ వద్ద బుధవారం ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కురుపాం తాలూకా కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షులు విక్టరీ, అబ్జర్వర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. కురుపాం తాలూకా అధ్యక్షులుగా ఎస్ఎస్ ప్రకాశ్‌రావు, కార్యదర్శిగా బి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా పి. భారతి, మొత్తం 12 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

ఆమోస సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన సహకార సంస్థ మేనేజర్‌గా పనిచేసిన దిమ్మలు ఆమోస సేవలు మరువలేనివని డిఎం జి.సంధ్యారాణి తెలిపారు. స్థానిక మేనేజర్ కార్యాలయంలో ఆమోస ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం సంధ్యారాణి మాట్లాడుతూ ఆమాస.. సేల్స్‌మేన్ నుంచి జిసిసికి మేనేజర్ స్థాయి వరకు ఎదిగి అనేక సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పాతపట్నం మేనేజర్ జి.నరసింహులు, సూపరింటెండెంట్ పి.ధర్మారావు, గంగాధర్, అకౌంటెంట్ చిన్నబాబు, చిన్నమ్మి, తదితరులు పాల్గొన్నారు.

జిసిసి మేనేజర్‌గా దాసరి కృష్ణ



మేనేజర్ కృష్ణ

గిరిజన సహకార సంస్థ సీతంపేట బ్రాంచ్ మేనేజర్‌గా దాసరి కృష్ణను నియమించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం గిరిజన సహకార సంస్థ హెడ్ ఆఫీస్‌లో పరిపాలన విభాగం నుంచి బదిలీపై వస్తున్నట్లు తెలిపారు

నేడు అన్నవరంలో గడపగడపకు..

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని అన్నవరం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ డి.త్రినాథులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామంలో మేలైన వ్యవసాయ పద్ధతులపై బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి ఎడిఎలు ఆర్.శ్రీనివాసరావు, బి.శారద మాట్లాడుతూ మేలైన వ్యవసాయ పద్ధతుల మార్గదర్శకాలను వివరించారు. ఆర్గానిక్ ఎవల్యుయేటర్ డాక్టర్ మూల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పురుగు మందుల వినియోగం తగ్గించడం, రసాయన అవశేషాలు లేని పంటను ధ్రువీకరణ చేయడం వల్ల మంచి ధర పొందవచ్చని తెలిపారు. అంతేకాకుండా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని చెప్పారు.

2 నుంచి 'ఇదేం కర్మ రాష్ట్రానికి' : టిడిపి



పాలకొండరూరల్.. మాట్లాడుతున్న నిమ్మక జయక్రిష్ణ

ప్రజాశక్తి-సాలూరు

ఈ నెల 2 నుంచి నియోజకవర్గంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి చెప్పారు. బుధవారం ఆమె నివాసంలో నిర్వహించిన టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తో కలిసి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో సాగిస్తున్న అరాచక, అవినీతి పాలన గురించి ఇంటింటికీ తిరిగి చెప్పనున్నామని తెలిపారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, నాయకులు ముఖి సూర్యనారాయణ, జి.వేణుగోపాల్, గెద్ద అన్నవరం పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : పట్టణ పరిధిలో నక్కలపేటలో కల్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయక్రిష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టే ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పల్లా కొండలరావు, కార్యదర్శి పొన్నాడ నాగేశ్వరరావు, మాజీ ఎఎంసి చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మండల అధ్యక్షులు గండి.రామినాయుడు, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్, ఉదయాన ఉదయ్‌భాస్కర్, సవరతోట ముఖలింగం, భూపతి ఆనంద్ రావు, మేడిబోయిన జగదీశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అధిష్టానం నిర్ణయానికి కట్టుబడతాం'

కురుపాం : టిడిపి అధిష్టానం ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికి ఇచ్చినా అంతా ఏకతాటిపైకి వచ్చి గెలుపునకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు తెలిపారు. మండలంలో తేనుఖర్జ తోట వద్ద బుధవారం టిడిపి నాయకులు బిడ్డక పద్మావతి, పువ్వల లావణ్య, బిడ్డక తమ్మయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపించి, అధినేత చంద్రబాబునాయుడుకు బహుమతిగా అందజేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చందక రామకృష్ణ, సువ్వాన గోవింద నాయుడు, ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దత్తి లక్ష్మణరావు



కన్వర్షన్ భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

భూమిని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కాశీపేట గ్రామానికి చెందిన గోపాల శెట్టి సూర్యరావు భూమిని ఆర్‌డిఒ కె.హేమలత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేయడంతో పరిశీలించేందుకు వచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, ఆర్‌ఐ సిహెచ్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'సత్యం ఆశయాలను కొనసాగిద్దాం'

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని పెద్దమేరంగి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ప్రజా కళాకారులు మరడాన సత్యనారాయణ సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల ప్రజాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ ప్రజా కళాకారుడిగా ప్రజల కోసం పాటల పాడుతూ చైతన్యపరచిన సత్యం ఆశయాలను కొనసాగించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎం.దామోదర్‌రావు, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎపి ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ద్వారపూడి ధనంజయ నాయుడు, మరిచర్ల బాపూజీ నాయుడు, రౌతు అజయ్ కుమార్, వి.మోహనరావు, వి.సుశీల, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తిసాలూరు



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ గణేశ్వరరావు

మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వి.గణేశ్వరరావు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాహిత్య కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచనలు సమాజానికి గొప్ప మేలుకొలుపు లాంటివన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-పాచిపెంట

ఆటోలో తరలిస్తున్న 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్ఐ ముసలయ్య తెలిపారు. ఒడిశాకు చెందిన కారా లక్ష్మణ, రఘునాథ్ పడాల్ ఆటోలో సారా తీసుకొస్తుండగా పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి, పట్టుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

నేరాలు ఘోరాలు

యాసిడ్ తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన కెల్ల నవీన్ (25) యాసిడ్ తాగి బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నవీన్ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నవీన్ వల్ల తమ పరువు పోయిందని మంగళవారం తల్లి పంటలమ్మ మందలించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న నవీన్ స్నానపుగదిలోని యాసిడ్ తాగాడు. వెంటనే స్థానిక పిహెచ్‌సికి కుటుంబ సభ్యులు తరలించారు. ఇక్కడ నుంచి 108 సహాయంతో పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి లక్ష్మునాయుడు ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ కృష్ణం నాయుడు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సీతంపేట

ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈసంఘటన గెద్దగూడ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. దోనుబాయి ఎస్ఐ కిశోర్‌వర్మ కథనం ప్రకారం.. మండలంలో కొండపల్లి గ్రామానికి చెందిన వూయిక నరేష్ (25) ద్విచక్రవాహనంపై ఘాటీ గుమ్మడలోని నాన్నమ్మ ఇంటికి వెళ్తుండగా, గెద్దగూడ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 వాహనం వచ్చేసరికి, అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. దీనిపై మృతుడు అన్న హరిప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐపి కిశోర్ వర్మ కేసు నమోదు చేశారు. నరేష్‌కి తల్లిదండ్రులు ఉన్నారు.